క్లుప్తంగా

సీఎం సహాయనిధి వరంలాంటిది



లబ్ధిదారులతో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరంలాంటిదని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 57 మంది లబ్ధిదారులకు రూ. 21.82 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య ఖర్చుల భారం పడకుండా ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరు చేస్తోందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు చిన్ను, మాజీ కౌన్సిలర్లు పోశెట్టి, పోశెట్టి, సోన్, దిలావర్‌పూర్, మామడ, నర్సాపూర్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, భుజంగా శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణచాంద జెడ్పీటీసీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లింబాద్రి

కుంటాల: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, ఐకేపీ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై గ్రామాల్లో యువకులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవా లని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన ధరలను కేంద్రం వెంటనే తగ్గించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఎల్లయ్య, సుదర్శన్, గోరె బాయి, వర్మ, కృష్ణ, రాజలింగు, రాజేశ్వర్, కమల తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు సర్వే

కడెం: మండలంలోని సారంగపూర్ నుంచి శ్రీఅక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్వే నిర్వహించినట్లు ఆర్అండ్‌బీ ఏఈఈ రఘు పేర్కొన్నారు. రూ.2.45 కోట్లతో 3.5 కి.మీ బీటీ రోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపులను దొంగలు పగులగొట్టి లోనికి చొరబడి రూ.లక్షకు పైచిలుకు విలువైన బంగారం, వెండితోపాటు నగదు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, తర్లపాడ్ శివారులోని అగ్గిమల్లన్న ఆలయంలో రూ.3వేల నగదుతోపాటు రూ.30వేల విలువైన సొత్తును దొంగలు ఎత్తుకెళ్లారని గ్రామానికి చెందిన చంద్రభూషణ్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

సెల్‌ఫోన్లు చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గండి రామన్న ఆలయంలో నిద్రిస్తున్న హనుమాన్ స్వాముల సెల్‌ఫోన్లు బుధవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఆలయంలో 12 మంది స్వాములు సన్నిధానం చేసుకుని అక్కడే ఉంటున్నారు. వైఎస్సార్ కాలనీకి చెందిన స్వాములు చిన్నయ్య, గంగాధర్ సుధాకర్, మురళి, ఎల్లయ్యలు బుధవారం రాత్రి పూజ అనంతరం నిద్రించారు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు స్వాముల సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై స్వాములు గురువారం పోలీసులకు సమాచారమిచ్చారు.

వేసవి క్రీడా శిబిరాలకు కసరత్తు

- జిల్లాకు 10 శిబిరాలు కేటాయించే అవకాశం
- శిక్షకుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం
- దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 15
- మే 1 నుంచి క్రీడాకారులకు శిక్షణ



నిర్మల్‌చైన్‌గేట్:ఔత్సాహిక క్రీడాకారులకు వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు మంచి వేదికగా ఉపయోగపడుతున్నాయి. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో చిన్నారులు, యువత కోసం ప్రత్యేక వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు నెల రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో వేలాదిమంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకుంటారు. ఈ శిబిరాల్లో ప్రతిభకనబరిచిన వారిని గుర్తించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు.

దరఖాస్తుల స్వీకరణ..

ఏటా వేసవిలో మే 1నుంచి 31వ తేదీ వరకు క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లా యువజన క్రీడల శాఖలు నిర్వహిస్తున్నాయి. ఈసారి ఒక్కో జిల్లాలో కనీసం పది గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. నిర్వహణకుగాను సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల నుంచి డీఎస్‌ఏ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 15వ తేదీ వరకు గడువుగా పేర్కొన్నాయి. అండర్–14 బాల, బాలికలు పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఒక్కో శిక్షకుడికి ప్రభుత్వమే నెలకు రూ.4 వేల గౌరవ వేతనం అందిస్తుంది. తాగునీటి వసతి, క్రీడా సామగ్రి కొనుగోలు, నిర్వహణకు రూ.5 వేలు, ప్రథమ చికిత్స కిట్లకు ప్రత్యేక నిధులివ్వనుంది. నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్‌గా కలెక్టర్, పర్యవేక్షకులుగా డీవైఎస్‌వో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. శిక్షకుల ఎంపిక ప్రక్రియ త్వరలో పూర్తికానుంది.

ప్రాధాన్యమున్న క్రీడలు..

ఆయా జిల్లాల్లో ఏ క్రీడకైతే ప్రాధాన్యం ఉందో ఆయా క్రీడాంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్ బాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, సాఫ్ట్ బాల్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, యోగా, విలువిద్య, బ్యాడ్మింటన్ క్రీడాంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం.

14 ఏళ్లలోపు బాల, బాలి కలకు మాత్రమే..

పూర్తిగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు వివిధ ఆటల్లో శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ శిబిరంలో చేరడానికి 14 ఏళ్లలోపు బాల బాలికలు మాత్రమే అర్హులు. జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ వేసవి క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆయా క్రీడల్లో మెళకువలు నేర్చుకునేందుకు ఇది మంచి అవకాశం.

సద్వినియోగం చేసుకోండి



ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతేడాది వేసవి శిబిరాల్లో చాలామంది విద్యార్థులు, ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సంబంధించి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఈనెల 15వ తారీకు సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాల కోసం 9346655441,7013396536 నంబర్లలో సంప్రదించాలి. కలెక్టర్ అనుమతితో త్వరలో శిబిరాల సంఖ్యపై స్పష్టత వస్తుంది. – బి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



అంబారిపేట్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భూమన్న

కడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూమన్న కోరారు. మండలంలోని అంబారిపేట్, నవబ్‌పేట్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌వో ఇన్‌చార్జి కోమల్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. డీఎస్‌వో డీఎం సుధాకర్, తహసీల్దార్ ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, లచ్చన్న, రమేశ్, శేఖర్, అంజన్న, సత్తెన్న, నారాయణ, భూమన్న, బుచ్చన్న పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ భూమన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. అనంతరం బీర్నంది గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ వైస్‌చైర్మన్ మాజిద్ ప్రారంభించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు శ్రీనివాస్, దయానంద్, రమేశ్, గంగాధర్, స్వప్నిల్‌రెడ్డి, అశోక్‌రావు, చంద్రయ్య, వీరేశ్, ధర్మరాజు, రాజు, సంతోష్, డీఎస్‌వో కోమల్‌రెడ్డి, డీఎం సుధాకర్, డీపీఎం రాజేశ్వర్, తహసీల్దార్ సుజాత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రంజిత్ ఉన్నారు.

గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్



దుప్యాతండాలో పార్టీ పతాకం ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య

సారంగపూర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గొప్పతనం గురించి ప్రజలకు వివరించడానికే అన్ని గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య అన్నారు. మండలంలోని దుప్యాతండా, పొట్యా గ్రామాల్లో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు పాల్పడుతుందని ఆరోపించారు. నాయకులు నవీన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రాము, లస్మన్న ఉన్నారు.

లోకేశ్వరం: ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. మండలంలోని సాథ్‌గాం, బిలోలి గ్రామాల్లో గురువారం జైబాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఊరేగింపుగా వెళ్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, ముధోల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షఫీ, లోకేశ్వరం మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి రామేశ్వర్‌రెడ్డి, నాయకులు నారాయణ్‌రెడ్డి, సాయారెడ్డి, నర్సారెడ్డి, సుధీర్‌రెడ్డి, బాయమొల్ల భోజన్న, దిగంబర్, రాజేశ్వర్ ఉన్నారు.

బీజేపీపై దుష్ప్రచారం తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: భారత రాజ్యాంగాన్ని మారుస్తారని బీజేపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పట్టణంలోని తన నివాసంలో భైంసా మండల క్రియాశీల సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అమలు చేసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, వక్ఫ్‌బిల్లు సవరణ వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. భారత్‌ను విశ్వగురుగా నిలపడమే బీజేపీ ధ్యేయమన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కేంద్ర పథకాలు, అభివృద్ధి పనులను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సిరం సుష్మరెడ్డి, సాయన్న, ఆత్మ మాజీ చైర్మన్ రవీందర్ రావ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ భైంసా మండల ప్రోగ్రాం కన్వీనర్ సాయినాథ్ పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతలు



మాలిక్ రెహమాన్

లక్ష్మణచాంద: నూతన ఎస్సైగా మాలిక్ రెహమాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సుమలత ఇటీవల బదిలీపై నిర్మల్ భరోసా కేంద్రానికి వెళ్లారు. భైంసా రూరల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మాలిక్ రెహమాన్ బదిలీపై లక్ష్మణచాంద వచ్చారు. బాధ్యతలు అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కుంటాల: జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక అకాల వర్షాలతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని వినతిలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, జిల్లా కార్యదర్శి కళ్యాణ్ గజేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తాటి శివ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల గజేందర్ పాల్గొన్నారు.

‘డబుల్’ వసతుల కల్పనకు భూమిపూజ

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో వసతులకు కల్పనకు ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. ఈ మేరకు గురువారం డబుల్ బెడ్రూం గృహ సముదాయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో డబుల్ బెడ్రూం ఇళ్లలో తాగునీరు, డ్రెయినేజీ వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వసతుల కల్పనలో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, డీఈఈ సునీల్, ఏఈ విశాల్, బీజేపీ నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కొండగట్టుకు కాలినడకన స్వాములు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి నుంచి హనుమాన్ స్వాములు గురువారం కాలినడకన కొండగట్టుకు బయల్దేరారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో వారిని సాగనంపారు.

దస్తురాబాద్: కొండగట్టులో ఈనెల 12న జరిగే చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రానికి చెందిన 160 హనుమాన్ భక్తులు, స్వాములతో కలిసి గురువారం పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. అర్చకుడు నరేషాచార్యులు, హనుమాన్ ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఈనెల 14న అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జయంతి ఉత్సవాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సుదర్శన్ పటేల్, లక్ష్మీబాయి ఇటీవల మృతి చెందారు. జెడ్పీ మాజీ చైర్మన్ అశోక్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సయ్యాజీ భోజారాం పటేల్, మాజీ సర్పంచ్ బాపురావు, గోపాల్ పటేల్, జుట్టు చరణ్, తదితరులు ఉన్నారు.

లింగాపూర్‌లో పోషణ్ పక్వాడ

కడెం: మండలంలోని లింగాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికల, గర్భిణుల ఎత్తు, బరువులను సూపర్‌వైజర్ ప్రేమలత పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, నేదూరి విజయ, సిబ్బంది ఉన్నారు.

ఆలయం ముస్తాబు

కడెం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం శుక్రవారం నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలను ముస్తాబైంది. తెల్లవారుజామున పంచామృత అభిషేకం, ఉదయం పుణ్య వచనము, హోమం, మధ్యాహ్నం మహానైవేద్యం హారతి, సాయంత్రం బాబా పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకలకు ఆయా గ్రామల నుంచి భక్తులు తరలిరానున్నారు.

బోరు పనులు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో నీటి ఎద్దడి విషయమై స్థానిక నాయకులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి నూతన బోరు ఏర్పాటుచేస్తానని ఇచ్చిన హామీ మేరకు గురువారం పనులను ఏఎంసీ వైస్ చైర్మన్ మాజిద్ ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, రమేశ్, శంకర్, యూసుఫ్‌ఖాన్, షౌకత్ పాషా, నంది రామయ్య పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే జయంతిని విజయవంతం చేయాలి

తానూరు: లోకేశ్వరం మండలం హద్‌గాం గ్రామంలో శుక్రవారం నిర్వహించే మహాత్మా జ్యోతిబాపూలే 198 జయంతిని జయప్రదం చేయాలని భారతీయ బౌద్ధమహాసభ జిల్లా నాయకుడు రమేశ్ బాబు వాగ్మారే ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉత్తర భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ గడపాలే హాజరవుతారని పేర్కొన్నారు. బౌద్ధమహాసభ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

సారంగపూర్: మండలంలోని హనుమాన్ తండాకు చెందిన తాజా మాజీ సర్పంచ్ పవార్ రాజేష్ తల్లి మాజీ ఎంపీపీ శెవంతాబాయి గురువారం అనారోగ్యంతో తన నివాసంలో మృతిచెందింది. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

మహిళా రైతు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి

సోన్: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు చేసుకోవాలని ఏఈవోలు ఉమామహేశ్వరి, అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో భూసార పరీక్షలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘంలో సభ్యత్వం తీసుకుని, గ్రామంలో కనీసంగా 20 మందితో సంఘం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్ష నిర్వహించి పంట వేసుకుని దిగుబడి పొందాలన్నారు. ఐకేపీ బాధ్యురాలు సరిత, గ్రామస్తులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఆర్డీవో, ఇన్‌చార్జి డీఎస్‌వో కోమల్‌రెడ్డి కోరారు. మండలంలోని గోసంపల్లె గ్రామంలో రేషన్ దుకాణంలో గురువారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యంలో నాణ్యతపై స్థానిక గ్రామప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. డీఎం సుధాకర్, తహసీల్దార్ సుజాత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రంజిత్, ఆర్ఐ సత్యనారాయణ, రేషన్ డీలర్ మడిపెల్లి సురేష్, గ్రామస్తులు రాజేందర్, సుబ్బాజి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పోషకాహారం అందిస్తోందని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, సీడీపీవో సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గురువారం నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్ ఆర్.విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

వీర హనుమాన్ శోభాయాత్ర



నృత్యం చేస్తున్న స్వాములు, యువకులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో వీర హనుమాన్ ఉత్సవ విగ్రహ శోభాయాత్ర గురువారం ప్రధాన వీధుల గుండా సాగింది. హనుమాన్ మాలధారణ స్వాములు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఇందులో స్వాములు నృత్యాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ప్రసాదం పంపిణీ చేశారు.



నిర్మల్‌లో కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో 67వ వార్షిక బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామ స్మరణతో మార్మోగింది. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందులో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



మామడ: హాజరైన భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవిభూదేవి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేశారు. అర్చకులు రామచంద్రచార్యులు, విజయ్‌స్వామి వేదమంత్రోచ్చారణలతో ఉత్సవ విగ్రహాలను అలంకరించి పల్లకీలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపించారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం వారికి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

మహాగాంలో కుస్తీపోటీలు



కుస్తీపోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో త్రియంబకేశ్వర ఆలయంలో జాతర ముగిసింది. మహాదేవుని జెండా పండుగ సందర్భంగా ఆలయంలో పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కుస్తీపోటీలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. మహారాష్ట్రలోని బిత్‌నాల్ గ్రామానికి చెందిన సాయినాథ్ ప్రథమ విజేతగా నిలవగా రెండవ విజేతగా మాధవ్ నిలిచారు. ప్రథమ బహుమతి రూ. 6500, 5 తులాల వెండి కడియం, ద్వితీయ బహుమతి రూ. 3100లను గెలుపొందిన మల్లయోధులకు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

ఉదారత చాటుకున్న విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద బి.నర్సయ్యకు పాఠశాల విద్యార్థులు 30 కిలోల బియ్యంతోపాటు రూ.500 ఆర్థిక సాయం అందజేసి ఉదారతను చాటారు. గత నెల క్రితం బియ్యంతో పాటు ఆర్థికసాయం చేశారు. తాజాగా గురువారం తమకు తోచిన సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం నరేందర్‌రావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మామడ: మండలంలోని పొన్కల్‌లో భీష్మ గంగపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, హరీశ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. చంద్రశేఖర్‌గౌడ్, రాజారెడ్డి, గంగన్న, రాందాస్, గంగారెడ్డి, చంద్రయ్య ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసి లింగన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పెన్షనర్లు కుటుంబ సభ్యులు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.